క్లుప్తంగా

జాబ్ మేళా రేపు

గుమ్మలక్ష్మీపురం: స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఈ నెల 13న ఉద్యోగ మేళా నిర్వహించనున్నట్లు ప్రిన్సిపాల్ డాక్టర్ టి.శ్రీవరం సోమవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఏపీ స్కిల్ డవలప్‌మెంట్ సంస్థ ఆధ్వర్యంలో నిర్వహించే ఈ జాబ్‌మేళాలో పలు ఫార్మా కంపెనీలతో పాటు బ్యాంకింగ్ అండ్ ఫైనాన్స్ కంపెనీలు పాల్గొంటున్నట్లు తెలిపారు. ఇంటర్మీడియట్, డిగ్రీ పాసైన నిరుద్యోగ యువత విద్యార్హత ధ్రువపత్రాల జిరాక్స్ కాపీలతో నేరుగా ఇటర్వ్యూకు హాజరుకావాలని సూచించారు. ఎంపికైన వారికి నెలకు రూ.20 వేల నుంచి రూ.25 వేల వరకు జీతభత్యాలు ఉండవచ్చని తెలిపారు. నిరుద్యోగ యువత ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

మహిళలు ఆర్థికంగా బలోపేతం కావాలి

కురుపాం: ప్రధాన మంత్రి ఆవాస్ యోజనా గ్రామీణ లబ్ధిదారులతో సోమవారం స్థానిక గృహనిర్మాణ శాఖ ఆధ్వర్యంలో వెబ్‌కాస్ట్ మీటింగ్ జరిగింది. ఈ సందర్భంగా పీఎం నరేంద్ర మోదీ సందేశాన్ని అధికారులు వెబ్‌కాస్ట్ ద్వారా మహిళలకు వినిపించారు. వికసిత్ భారత్ కార్యక్రమంలో భాగంగా మహిళలు ఆర్థికంగా బలోపేతం కావాలని మోదీ పిలుపునిచ్చారు. సమావేశంలో హౌసింగ్ డీఈ పి.మోహనరావు, వర్క్ఇన్‌స్పెక్టర్లు, పీఎంఏవై లబ్ధిదారులు పాల్గొన్నారు.

ఘనంగా కాశీవిశ్వేశ్వరుని చక్రతీర్థ స్నానం



మేళతాళాలతో ఉత్సవ విగ్రహాల ఊరేగింపు

భామిని: మండలంలోని సొలికిరిలో అన్నపూర్ణ సహిత కాశీవిశ్వేశ్వరుని చక్రతీర్థ స్నానాలు సోమవారం ఘనంగా నిర్వహించారు. ఉత్సవ విగ్రహాలను మేళతాళాలతో వంశధార నదీతీరానికి ఊరేగింపుగా తీసుకువెళ్లారు. వేదమంత్రాలతో స్వామివారికి చక్రతీర్థ స్నానం చేయించారు. అనంతరం తీరంలో వేసిన మండపంలో ఉత్సవ విగ్రహాలకు ప్రత్యేక పూజలు చేశారు. చక్రతీర్థ స్నానాల సందర్భంగా శివ నామ స్మరణతో గ్రామం మార్మోగిపోయింది. సొలికిరి, బాలేరు, ఒడిశా ఈదుడి, కాశీనగర్‌కు చెందిన భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

రహదారి సమస్య పరిష్కరించాలని వినతి

పాలకొండ: మండలంలోని వెలగవాడ నుంచి పీఆర్ రాజుపేట గ్రామం వరకు ఉన్న రహదారి సమస్యను పరిష్కరించాలని అభ్యుదయ రైతు కండాపు ప్రసాదరావు కోరారు. ఎంపీడీఓ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన స్పందనలో ఈ మేరకు వినతిపత్రం అందించారు. వెలగవాడ గ్రామస్తులు రహదారిని బహిర్భూమిగా వినియోగిస్తుండటంతో వెలగవాడ నుంచి రాజుపేట వెళ్లేందుకు ఇబ్బందులు పడుతున్నామని, ఈ సమస్య కారణంగా ఇరు గ్రామాల మధ్య గొడవలు జరుగుతున్నాయని అన్నారు. అధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలని కోరారు.

కేదారిపురంలో 'మేము సిద్ధం'



ఇంటింటికీ వెళ్లి ప్రచారం చేస్తున్న వైఎస్సార్‌సీపీ కార్యకర్తలు

గుమ్మలక్ష్మీపురం: మండలంలోని కేదారిపురం గ్రామంలో 'మేము సిద్ధం- మా బూత్ సిద్ధం' కార్యక్రమాన్ని సోమవారం నిర్వహించారు. సచివాలయ కన్వీనర్ ఎన్.కృష్ణారావు ఆధ్వర్యంలో వైఎస్సార్‌సీపీ శ్రేణులు గ్రామంలోని ఇంటింటికీ వెళ్లి ఐదేళ్లలో ప్రభుత్వం అందించిన సంక్షేమ పథకాల లబ్ధిని వివరించారు. సంక్షేమ పాలన అందిస్తున్న జగనన్నను మరోసారి ముఖ్యమంత్రిని చేయాలని కోరారు.

తాగునీటి బోర్లకు మరమ్మతులు

జియ్యమ్మవలస: ప్రజలకు వేసవిలో తాగునీటి ఇబ్బందులు లేకుండా చూడటమే క్రాస్‌ప్రోగ్రాం ఉద్దేశమని ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ భరత్‌చంద్ర అన్నారు. మండలంలోని చినమేరంగిలో ప్రతాపరుద్ర కాలనీలో పాడైన తాగునీటి బోర్లకు సోమవారం మరమ్మతులు చేపట్టారు. క్రాస్ ప్రోగ్రాం కింద గ్రామాల్లో పాడైన బోర్లు, రక్షిత మంచినీటి పథకాలకు మరమ్మతులు చేపడుతున్నట్లు చెప్పారు. గ్రామాల్లో బోర్లు పాడైతే వెంటనే సమాచారం అందించాలని కోరారు.

26న కలెక్టరేట్ వద్ద నిరసన

గుమ్మలక్ష్మీపురం: గిరిజనులకు ప్రత్యేక డీఎస్సీని నిర్వహించాలన్న డిమాండ్‌తో ఈనెల 26న కలెక్టరేట్ వద్ద నిరుద్యోగ గిరిజన యువతతో కలిసి నిరసన చేపట్టనున్నట్లు ట్రైబల్ రైట్ ఫోరం రాష్ట్ర అధ్యక్షుడు రొబ్బా లోవరాజు, జిల్లా అధ్యక్షుడు ఇంటికుప్పల రామకృష్ణ సోమవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఇటీవల ఉపాధ్యాయ నియామక నోటిఫికేషన్‌లో 5వ షెడ్యూల్‌లో ఉన్న గిరిజనులకు అన్యాయం జరిగిందన్నారు. కావున గిరిజన విద్యార్థుల కోసం ప్రత్యేక డీఎస్సీ నిర్వహించేలా ప్రభుత్వానికి నివేదించనున్నట్లు తెలిపారు. నిరసన కార్యక్రమానికి నిరుద్యోగ గిరిజన యువత పెద్ద ఎత్తున పాల్గొనాలని కోరారు.

బెజ్జిలో అభివృద్ధి భేష్

- టీడీపీ హయాంలో అభివృద్ధికి దూరంగా..
- నేడు అన్ని వసతులతో ఆదర్శంగా..

పాలకొండ రూరల్: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నాయకత్వంలోని వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం గ్రామాభివృద్ధికి పెద్దపీట వేసింది. గ్రామాల్లో మౌలిక వసతులు కల్పంచడంతో పాటు ప్రభుత్వ సేవలను గడప వద్దకే చేరవేస్తోంది. టీడీపీ ప్రభుత్వంలో అభివృద్ధికి దూరంగా ఉన్న పల్లెలు నేడు ప్రగతి పథంలో దూసుకుపోతున్నాయి. పాలకొండ- వీరఘట్టం మండలాల సరిహద్దు గ్రామం బెజ్జి ఇందుకు ఉదాహరణ. బెజ్జి సచివాలయం పరిధిలో టీకే రాజపురం, టీడీ పారాపురం, బెజ్జి గ్రామాలు ఉన్నాయి. మొత్తం 1,869 మంది జనాభా ఉండగా వారిలో 910 మంది పురుషులు, 986 మంది మహిళలున్నారు. 1,667 మంది ఓటు హక్కు కలిగి ఉన్నారు. వారిలో పురుషులు 819, స్త్రీలు 848 మంది ఉన్నారు. మండల కేంద్రానికి దూరంగా విసిరేసినట్లు ఉన్న ఈ గ్రామాలను గత ప్రభుత్వాలు పట్టించుకోకపోవడంతో అభివృద్ధిలో వెనుకబడ్డాయి. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో ఈ గ్రామాలు అభివృద్ధికి నోచుకున్నాయి. సచివాయం, ఆర్‌బీకే, వెల్‌నెస్ కేంద్రం ఏర్పాటుతో ప్రజల వద్దకే ప్రభుత్వ సేవలన్నీ అందుతున్నాయి. అర్హుల ఉన్న ప్రతి కుటుంబానికి సంక్షేమ పథకాలు అందుతున్నాయి. స్థానిక యువతకు ప్రభుత్వ కొలువులు లభించాయి. ప్రజల జీవన ప్రమాణాలు మెరుగుపడటంతో ప్రతి ఒక్కరూ ఆనందంగా ఉన్నారు. సంక్షేమ పాలన అందిస్తున్న సీఎం జగన్‌కు గ్రామస్తులంతా మద్దతిస్తున్నారు.

సచివాలయ పరిధిలో అభివృద్ధి

- సచివాలయం పరిధిలోని టీకే రాజపురం, టీడీ పారాపురం, బెజ్జి గ్రామాల ప్రజలకు సేవలు అందించేందుకు రూ.25 లక్షలతో గ్రామ సచివాలయం నిర్మించారు.
- రైతులకు అవసరమైన సేవలందించేందుకు రూ. 21.80 లక్షలతో రైతు భరోసా కేంద్రం నిర్మాణం.
- గ్రామస్థాయిలోనే ప్రజలకు మెరుగైన వైద్య సేవలందించేందుకు గాను రూ.17.50 లక్షలతో విలేజ్ హెల్త్ క్లీనిక్‌ను నిర్మిస్తున్నారు.
- టీకే రాజపురంలో రూ.30.50 లక్షలతో 40 వేల లీటర్ల సామర్థ్యంతో రక్షిత మంచినీటి పథకం నిర్మాణం చేపడుతోంది.
- టీడీ పారాపురంలో జేజేఎం పథకం ద్వారా రూ.26.96 లక్షలతో రక్షిత పథకం నిర్మాణానికి చర్యలు చేపట్టారు.
- నాడు-నేడు నిధులు రూ.36 లక్షలతో బెజ్జి, టీకే రాజపురం ప్రభుత్వ పాఠశాలలను అధునాతనంగా తీర్చిదిద్దారు.
- 'గడపగడపకు మన ప్రభుత్వం' నిధులు రూ.20 లక్షలతో సచివాలయం పరిధిలో సీసీ రహదారులు, వీధి కాలువల నిర్మాణాలు చేపడుతున్నారు.



నాడు-నేడు ద్వారా కొత్తరూపు సంతరించుకున్న ప్రభుత్వ పాఠశాల



బెజ్జి గ్రామ సచివాలయ భవనం



రైతుభరోసా కేంద్రం

సంక్షేమ లబ్ధి..

నవరత్నాల పేరిట సచివాలయం పరిధిలో అర్హత కలిగిన ప్రతీ ఒక్కరికి సంక్షేమ ఫలాలను అందించటం జరిగింది. ఈ క్రమంలో డీబీటీ విధానంలో రూ.9,84,74,301 నగదు రూపంలో లబ్ధిదారుల బ్యాంక్ ఖాతాలకు జమచేటం జరిగింది. అలాగే పరోక్షంగా 38 మందికి ఇళ్ల స్థలాలు, 135 మందికి విద్యాకానుక, 22 మంది 8వ తరగతి విద్యార్థులకు బైజూస్ ట్యాబ్‌లు, జగనన్నతోడు పథకం ద్వారా 41 మందికి రుణాలు, 125 మంది విద్యార్థులకు గోరుముద్ద, 93 మందికి వైఎస్సార్ సంపూర్ణ పోషణ, 321 మందికి రేషన్, తదితర పథకాల కోసం రూ.2,13,53,222లు ఖర్చు ప్రభుత్వం ఖర్చుచేసింది. మొత్తంగా సచివాలయం పరిధిలో డీబీటీ, నాన్ డీబీటీ విధానంలో రూ.11,98,27,523లు ప్రజల కోసం ప్రభుత్వం ఖర్చుచేసింది.

సంక్షేమ లబ్ధిపొందుతున్నారు



ప్రస్తుత ప్రభుత్వంలో కొలువుతీరిన సచివాలయ, వలంటీరు వ్యవస్థలతో ప్రభుత్వమే పల్లెల్లోకి వచ్చినట్లుంది. గతంలో ఏ చిన్న పనికావాలన్నా మండల కేంద్రానికి వెళ్లి ఇబ్బందులు పడేవాళ్లం. ఇప్పుడు ఆ పరిస్థితి లేదు. నా కళ్లమందే గ్రామాల్లో మార్పు ప్రారంభమైయ్యింది. సచివాయాలు, రైతుభరోసా, వెల్‌నెస్ కేంద్రాలు, అంగన్‌వాడీ, పాఠశాలలు కొత్తరూపు సంతరించుకున్నాయి. అర్హులు ఉన్నచోటకే సంక్షేమ లబ్ధి వచ్చి అందుతోంది. ఈ ప్రభుత్వంలో నా కుమార్తెకు మహిళా పోలీస్ ఉద్యోగం వచ్చింది. రైతు భరోసా, సున్నావడ్డీ, ఆసరా వంటి పథకాలు మాకు వర్తించాయి.

– వావిలపల్లి శ్రీనివాసరావు, బెజ్జి గ్రామస్తుడు

పథకం	లబ్ధిదారులు	చెల్లించిన నగదు
జగనన్న అమ్మ ఒడి	185	రూ.84,80,587
జగనన్న విద్యాదీవెన	169	రూ.33,03,998
జగనన్న వసతి దీవెన	140	రూ.21,28,515
వైఎస్సార్ రైతు భరోసా	374	రూ.1,78,63,300
వైఎస్సార్ సున్నావడ్డీ (పంట రుణాలు)	186	రూ.5,30,603
వైఎస్సార్ పంట బీమా	1	రూ.5,666
వైఎస్సార్ పింఛన్ కానుక	351	రూ.3,41,57000
వైఎస్సార్ చేయూత	189	రూ.84,56,250
వైఎస్సార్ ఆసరా	436	రూ.1,59,23,617
వైఎస్సార్ సున్నావడ్డీ (ఎస్‌హెచ్‌జీలకు)	521	రూ.8,67,683
వైఎస్సార్ కాపు నేస్తం	7	రూ.2,85000
వైఎస్సార్ ఈబీసీ నేస్తం	2	రూ.60,000
వైఎస్సార్ కల్యాణమస్తు/ షాదీతోఫా	1	రూ.50,000
వైఎస్సార్ ఆరోగ్యశ్రీ	96	రూ.31,57,327
వైఎస్సార్ ఆరోగ్య ఆసరా	66	రూ.4,28,275
హౌసింగ్ (లబ్ధిదారులకు నేరుగా చెల్లింపులు)	7	రూ.7,38,185
వైఎస్సార్ బీమా	6	రూ.9,30,000
వైఎస్సార్ వాహనమిత్ర	10	రూ.3,30,000
జగనన్న చేదోడు	9	రూ.1,70,000
కోవిడ్ ప్రత్యేక సహాయం (తెల్ల రేషన్ కార్డుదారులకు)	580	రూ.5,80,000
జగనన్న తోడు(వడ్డీ)	26	రూ.8,295
మత్స్యకార భరోసా	2	రూ.20,000

సీఎం జగన్‌తోనే సంక్షేమం

- ఎమ్మెల్యే కళావతి, ఎమ్మెల్సీ విక్రాంత్



చేయూత చెక్కును అందిస్తున్న ఎమ్మెల్యే కళావతి, ఎమ్మెల్సీ విక్రాంత్

పాలకొండ: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డితోనే సంక్షేమ పాలన సాధ్యమని ఎమ్మెల్యే విశ్వాసరాయి కళావతి, ఎమ్మెల్సీ పాలవలస విక్రాంత్ అన్నారు. పట్టణంలోని మహిళలకు ప్రభుత్వం అందించిన చేయూత చెక్కులను సోమవారం లబ్ధిదారులకు అందజేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభలో వారు మాట్లాడుతూ.. ఎన్నికల మేనిఫెస్టోలో ఇచ్చిన ప్రతీ హామీని సీఎం జగన్‌మోహన్‌రెడ్డి నెరవేర్చారని అన్నారు. అధికారంలో ఉన్నప్పుడు మహిళా సంఘాలను పూర్తిగా నిర్వీర్యం చేసిన చంద్రబాబు ఇప్పుడు అధికారం కోసం బూటకపు హామీలతో మహిళలను మోసం చేసేందుకు ప్రయత్నిస్తున్నారని దుయ్యబట్టారు. ప్రతిపక్షాల మాటలు నమ్మి మోసపోవద్దని మహిళలను కోరారు. ఈ ప్రభుత్వంలో మీకు మంచి జరిగిందని అనిపిస్తే మీరంతా సీఎం జగన్‌కు అండగా ఉండాలని కోరారు. ప్రస్తుతం అందిస్తున్న పథకాలు కొనసాగాలన్నా, పేదలకు మరింత మేలు జరగాలన్నా జగన్‌మోహన్‌రెడ్డిని మరోసారి ముఖ్యమంత్రిని చేసుకోవాల్సిన అవసరం ఉందన్నారు. అనంతరం రూ.13.14 కోట్ల చేయూత చెక్కులను లబ్ధిదారులకు అందించారు. కార్యక్రమంలో కమిషనర్ సర్వేశ్వరరావు, నగరపంచాయతీ చైర్మన్ యందవ రాధాకుమారి, వైస్ చైర్మన్‌లు రౌతు హనుమంతురావు, పల్లా ప్రతాప్, పార్టీ పట్టణ అధ్యక్షుడు వి.మన్మథరావు, కూరాకుల కార్పొరేషన్ డైరెక్టర్ తూముల లక్ష్మణరావు, పలువురు కౌన్సిలర్లు పాల్గొన్నారు.

పోలింగ్ కేంద్రం పరిశీలన



పోలింగ్ స్టేషన్ వద్ద సిబ్బందితో మాట్లాడుతున్న ఆర్వో వి.వి.రమణ

కొమరాడ: మండలంలోని వన్నాం గ్రామంలో నూతనంగా నిర్మించిన పోలింగ్ స్టేషన్‌ను పాలకొండ ఆర్డీఓ, కురుపాం ఆర్వో వి.వి.రమణ సోమవారం పరిశీలించారు. అక్కడ అందుబాటులో ఉన్న వసతులపై ఉపాధ్యాయులను అడిగి తెలుసుకున్నారు. తాగునీరు, టాయిలెట్లు, ర్యాంపులు ఉండేలా చర్యలు తీసుకోవాలని, పెండింగ్‌లో ఉన్న పనులు పూర్తి చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు.

రైతుభరోసా కేంద్రం ప్రారంభం



పెదబుడ్డిడిలో ఆర్‌బీకేను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే పుష్పశ్రీవాణి

జియ్యమ్మవలస: మండలంలోని పెదబుడ్డిడి, తురకనాయుడువలస సచివాలయ పరిధిలో రైతు భరోసా కేంద్రాలను ఎమ్మెల్యే పాముల పుష్పశ్రీవాణి సోమవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. సీఎం జగన్‌మోహన్‌రెడ్డి రైతుల పక్షపాతి అని, అన్నదాత సంక్షేమం కోసం ప్రభుత్వం అన్ని పంచాయతీల్లో ఆర్‌బీకేలను ఏర్పాటు చేస్తోందన్నారు. రైతులకు కావాల్సిన విత్తనాలు, పురుగుమందులు, రైతులు పండించిన ప్రతీ పంటను మద్దతు ధరకు అమ్ముకునేందుకు ఆర్‌బీకేలు ఎంతగానో ఉపయోగకరంగా ఉంటాయన్నారు. రానున్న ఎన్నికల్లో జగనన్నను రెండోసారి ముఖ్యమంత్రిని చేసుకునేందుకు ప్రతి ఒక్కరూ కృషిచేయాలన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ సీమల సుజాత, మాజీ ఎంపీటీసీ బాబూ భువనమోహనరావు, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ మూడడ్ల గౌరీశంకరరావు, డీసీసీబీ డైరెక్టర్ లోలుగు నారాయణరావు, మాజీ ఎంపీపీ గూనగంజి చంద్రయ్య, తదితరులు పాల్గొన్నారు.

కేజీబీవీలో ప్రవేశానికి దరఖాస్తుల ఆహ్వానం

వీరఘట్టం: రేగులపాడు కేజీబీవీలో 2024–25 విద్యా సంవత్సరంలో ఆరో తరగతి, ఇంటర్ ఫస్టియర్‌లో ప్రవేశాలకు దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు ప్రిన్సిపాల్ ఐ.ప్రమీల పేర్కొన్నారు. 6వ తరగతిలో 40, ఇంటర్మీడియట్‌లో 40 సీట్లు అందుబాటులో ఉన్నట్లు తెలిపారు. అర్హులైన బాలికలు ఏపీ కేజీబీవీ. ఏపీసీఎఫ్ఎస్ఎస్.ఇన్‌లో దరఖాస్తులు చేసుకోవాలని, లేదంటే నేరుగా రేగులపాడు కేజీబీవీకి వచ్చినా మీ దరఖాస్తు ఆన్‌లైన్ చేయడం జరుగుతుందన్నారు. మరిన్ని వివరాలకు 7893161665 నంబరులో సంప్రదించాలని కోరారు.

- భామిని: కేజీబీవీలో 6వ తరగతి, ఇంటర్మీడియట్‌లో ప్రవేశాలకు ఆన్‌లైన్‌లో దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు ప్రిన్సిపాల్ బి.భాగ్యవతి తెలిపారు. 6వ తరగతిలో 40, 8వ తరగతిలో 01, ఇంటర్ ఫస్ట్ ఇయర్ సీఈసీలో 40 సీట్లు అందుబాటులో ఉన్నట్లు పేర్కొన్నారు. తల్లిదండ్రులు లేని విద్యార్థులు, వలస కార్మికుల పిల్లలకు ప్రవేశాల్లో ప్రాధాన్యత ఉంటుందన్నారు. ఆసక్తి ఉన్నవారు ఏప్రిల్ 11లోగా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.
- కురుపాం: కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయంలో 2024–25 విద్యా సంవత్సరానికి గాను ఆరో తరగతిలో ప్రవేశాలకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపాల్ ఇంటికుప్పల కిరణ్‌కుమారి సోమవారం తెలిపారు. 6వ తరగతిలో 40 సీట్లు, 7వ తరగతిలో 01, ఇంటర్మీడియట్ ఫస్ట్ ఇయర్ ఎంపీసీలో 40 సీట్లు అందుబాటులో ఉన్నట్లు వెల్లడించారు. ఆసక్తి ఉన్న విద్యార్థినులు ఏప్రిల్ 11వ తేదీలోగా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని కోరారు.
- గుమ్మలక్ష్మీపురం: కేజీబీవీలో 6వ తరగతి, ఇంటర్మీడియట్ ప్రథమ సంవత్సరంలో ప్రవేశాలకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపాల్ సీహెచ్ శ్రీరంజని తెలిపారు. 6వ తరగతిలో 40 సీట్లు, ఇంటర్మీడియట్‌లో 40 సీట్లు, 9వ తరగతిలో 02 సీట్లు ఖాళీగా ఉన్నాయన్నారు. విద్యార్థి, తల్లిదండ్రుల ఆధార్ కార్డులు, రేషన్ కార్డు, ప్రస్తుతం చదువుతున్న పాఠశాల వివరాలు, విద్యార్థి పాస్ ఫొటో, మొబైల్ నంబర్‌తో ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

నిజమైన ఆదివాసీలకే సీట్లు కేటాయించాలి



నినాదలు చేస్తున్న ఆదివాసీ జేఏసీ నాయకులు

సీతంపేట: రాబోయే సార్వత్రిక ఎన్నికల్లో రాష్ట్రంలో 7 ఎస్టీ రిజర్వ్‌డ్ ఎమ్మెల్యే, ఒక ఎంపీ సీటును నిజమైన ఆదివాసీ అభ్యర్థులకు కేటాయించాలని, నకిలీ అభ్యర్థులకు సీట్లు ఇవ్వొద్దని ఆదివాసీ జేఏసీ నాయకులు కె.ధర్మారావు, బి.ఉమామహేశ్వరరావు తదితరులు సోమవారం ఒక ప్రకటనలో కోరారు. గతంలో అరుకు ఎంపీగా పనిచేసిన కొత్తపల్లి గీత ఎస్టీ కాదని డీఎల్ఎస్‌సీ కోర్టు తీర్పు ఇచ్చినా.. ఇప్పుడు బీజేపీ పార్టీ ఎస్టీ రిజర్వ్‌డ్ నుంచి ఎంపీ సీటు కేటాయించాలని భావిస్తోందన్నారు. దీన్ని తీవ్రంగా వ్యతిరేకిస్తున్నట్లు తెలిపారు. ఇదే జరిగితే జాతీయ పార్టీ అయిన భారతీయ ఆదివాసీ పార్టీ తరఫున అన్ని అస్సెంబ్లీ స్థానాల్లో అభ్యర్థులను బరిలోకి దింపి తాము గెలిపించుకుంటామన్నారు.

నిబంధనల మేరకు చెల్లింపులు

గరుగుబిల్లి: పంచాయతీల్లో జరుగుతున్న అభివృద్ధి పనులకు సంబంధించి ప్రభుత్వ నిబంధనల మేరకు చెల్లింపులు చేయనున్నట్లు ఈఓపీఆర్డీ ఎల్.గోపాలరావు తెలిపారు. సోమవారం ఆయన మాట్లాడుతూ.. ఎన్ఐసీ నిబంధనల మేరకు డిజిటల్ చెల్లింపులు నిర్వహించాలని కార్యదర్శులకు ఆదేశించడం జరిగిందన్నారు. నిధుల దుర్వినియోగం కాకుండా ఉండేలా ప్రభుత్వం ఆదేశాలు జారీచేసినట్లు చెప్పారు. అభివృద్ధి పనులలో ప్రజాప్రతినిధులు సిబ్బందికి సహకరించాలని కోరారు. అభివృద్ధి పనులకు సంబంధించిన బిల్లులను కార్యదర్శులు ఆన్‌లైన్‌లో నమోదుచేయడం జరుగుతుందన్నారు.

సిద్ధం సభతో కదిలిన ప్రత్యర్థుల పునాదులు



మాట్లాడుతున్న ఎంపీపీ దమలపాటి, తదితరులు

వీరఘట్టం: సీఎం జగన్‌మోహన్‌రెడ్డి అద్దంకిలో నిర్వహించిన సిద్ధం సభతో ప్రత్యర్థుల పునాదులు కదులుతున్నాయని ఎంపీపీ దమలపాటి వెంకటరమణనాయుడు, వైఎస్సార్‌సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి కర్రి లీలాప్రసాదరావు అన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయం వద్ద ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో వారు మాట్లాడారు. సిద్ధం సభకు లక్షలాదిగా ప్రజలు, వైఎస్సార్‌సీపీ అభిమానులు తరలిరావడంతో సభాప్రాంగణం జనసంద్రమైందని, అయితే పచ్చమీడియా మాత్రం సిద్ధం సభకు జనాదరణ లేదని తప్పుడు వార్తలు రాస్తున్నాయని మండిపడ్డారు. సిద్ధం సభకు వచ్చిన జన సునామీని చూసి ఓర్వలేకనే ఇటువంటి తప్పుడు వార్తలు రాస్తున్నాయన్నారు. మీరు ఎంత మందితో పొత్తులు పెట్టుకున్నా, రానున్న సార్వత్రిక ఎన్నికల్లో గెలిచేది వైఎస్సార్‌సీపీ యేనని, మళ్లీ ముఖ్యమంత్రి అయ్యేది వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డేనని ధీమా వ్యక్తం చేశారు. ఓటమి భయంతోనే సాధ్యం కాని హామీలు ఇచ్చి ప్రజలను టీడీపీ మోసం చేయాలని చూస్తోందన్నారు. రానున్న ఎన్నికల్లో టీడీపీ కూటమికి ఘోర పరభావం తప్పదన్నారు. సమావేశంలో పీఏసీఎస్ అధ్యక్షుడు కర్రి గోవిందరావు, భోగి మణి, సాంబ్యాన సింహాచలం, తదితరులున్నారు.

సచివాలయాల్లో పోటీపరీక్షల పుస్తకాలు



పోటీ పరీక్షల పుస్తకాలను పరిశీలిస్తున్న ఎంపీడీఓ సుబ్రహ్మణ్యం

వీరఘట్టం: మండలంలోని చిదిమి, కిమ్మి, కంబర, తూడి, వండవ, నడిమికెల్ల, తెట్టంగి సచివాలయాల్లో పోటీ పరీక్షలకు సిద్ధమయ్యేందుకు అవసరమైన పుస్తకాలు అందుబాటులో ఉంచినట్లు ఎంపీడీఓ ఎంవీబీ సుబ్రహ్మణ్యం తెలిపారు. ప్రభుత్వం నుంచి వచ్చిన 21 రకాల పోటీ పరీక్షల పుస్తకాలను సోమవారం ఆయా గ్రామాల సచివాలయాలకు అందజేశారు. డీఎస్సీ, గ్రూప్స్, ఇతర పోటీ పరీక్షలకు సన్నద్ధమయ్యే అభ్యర్థులు వాటిని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. పంచాయతీ కార్యదర్శి అనుమతితో వాటిని ఇంటికి తీసుకువెళ్లి చదువుకోవచ్చన్నారు. ఆయనతో పాటు సూపరింటెండెంట్ వెంకటరమణ ఉన్నారు.

నేడు ఇళ్ల పట్టాల పంపిణీ

గరుగుబిల్లి: మండలంలోని రావుపల్లి గ్రామంలో పేదలకు మంగళవారం సాయంత్రం ఎమ్మెల్యే పాముల పుష్పశ్రీవాణి చేతులమీదుగా ఇళ్ల పట్టాలు, డీ-పట్టాల పంపిణీ చేయనున్నట్లు ఎంపీపీ ఉరిటి రామారావు, జెడ్పీ వైస్ చైర్మన్ మరిశర్ల బాపూజీనాయుడు సోమవారం తెలిపారు. కార్యక్రమంలో సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, సచివాలయ కన్వీనర్లు, గృహసారథులు, వలంటీర్లు, బూత్ కన్వీనర్లు, పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

మాదకద్రవ్యాలతో ఆరోగ్యానికి ముప్పు



అవగాహన కల్పిస్తున్న ఎన్ఎస్ఎస్ బృందం

గరుగుబిల్లి: మాదకద్రవ్యాల నిషేధంపై ప్రజలు అవగాహన కలిగి ఉండాలని డా.వైఎస్సార్ ఉద్యాన కళాశాల అసోసియేట్ డీన్ డా. బి.ప్రసన్నకుమార్ అన్నారు. మండలంలోని సంతోషపురం గ్రామంలో సోమవారం డా.వైఎస్సార్ ఉద్యాన కళాశాల విద్యార్థులు జాతీయ సేవా పథకం (ఎన్ఎస్ఎస్) ఆధ్వర్యంలో నిర్వహించిన మన గ్రామం-మన విశ్వవిద్యాలయం కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. మాదకద్రవ్యాల వినియోగం వల్ల కలిగే ఆరోగ్య, మానసిక సమస్యలను వివరించారు. మద్యం, ధూమపానం, మాదకద్రవ్యాల వినియోగం వల్ల డబ్బు కోల్పవడంతో పాటు సమాజంలో చులకన అయిపోతారన్నారు. చట్టం దృష్టిలో దోషులుగా నిలబడతారన్నారు. కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ ఎ.తవిటినాయుడు, కార్యదర్శులు చరణ్ పండిత్, రాజేష్, వీఆర్ఓ రామకృష్ణ, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం అధికారి డా.హరిరామ కుమార్, తదితరులు పాల్గొన్నారు.

ఉత్తమ ఫలితాలు సాధించాలి



పదోతరగతి విద్యార్థులతో హెచ్ఎం, ఉపాధ్యాయులు

పాలకొండ రూరల్: రానున్న పదో తరగతి పబ్లిక్ పరీక్షల్లో విద్యార్థులు శతశాతం ఫలితాలు సాధించాలని మండలంలోని చిన మంగళాపురం జెడ్పీ ఉన్నత పాఠశాల హెచ్ఎం జామి రవి అన్నారు. పాఠశాలలో పదో తరగతి చదువుతున్న విద్యార్థులకు సోమవారం వ్యక్తిత్వవికాశ కార్యక్రమం చేపట్టారు. పరీక్షల సమయంలో శరీకకంగా, మానసికంగా బలంగా ఉండాలన్నారు. సమయం వృథా చేకుండా సబ్జెక్టు వారీగా సిలబస్ పూర్తి చేసుకోవాలన్నారు. ఆరోగ్యపరమైన సమస్యలు తలెత్తకుండా జాగ్రత్తలు వహించాలని విద్యార్థులకు సూచించారు. సహచర ఉపాధ్యాయుల సహకారంతో విద్యార్థులకు పెన్నులు, ప్లాంకులను అందించారు.

మాతాశిశు ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ

గరుగుబిల్లి: గర్భిణులు, చిన్నారుల ఆరోగ్య సంరక్షణపై ప్రత్యేక శ్రద్ధ పెట్టాలని డీఎంఓ డాక్టర్ టి.జగన్మోహనరావు అన్నారు. మండలంలోని బీవీపురం, ఉల్లిభద్ర గ్రామాల్లోని అంగన్‌వాడీ కేంద్రాలను సోమవారం ఆయన తనిఖీ చేశారు. చిన్నారుల ఎత్తు, బరువు, హెల్త్ రికార్డులను పరిశీలించారు. రక్తహీనత, ఎదుగుదల లోపంతో బాధపడుతున్న చిన్నారుల ఆరోగ్యం మెరుగుపరిచేందుకు చేపట్టాల్సిన చర్యలను వివరించారు. మాతాశిశు ఆరోగ్య వృద్ధికి సిబ్బంది సమష్టిగా కృషిచేయాలన్నారు. గ్రామాల్లో అనారోగ్యంతో బాధపడుతున్న వారు పీహెచ్‌సీకి వెళ్లి వైద్య సేవలు పొందేలా చూడాలన్నారు. కార్యక్రమంలో వైద్యసిబ్బంది పార్వతి, మాలతి, అనిత, అంగన్‌వాడీ సిబ్బంది పాల్గొన్నారు.

మాతాశిశు ఆరోగ్యాభివృద్ధిపై దృష్టి

వీరఘట్టం: మాతాశిశు ఆరోగ్యంపై వైద్య ఆరోగ్యశాఖ సిబ్బంది ప్రత్యేక దృష్టి సారించాలని ఎంపీడీఓ ఎంవీబీ సుబ్రహ్మణ్యం సూచించారు. పంచాయతీ కార్యదర్శులు, ఆరోగ్య సిబ్బందితో సోమవారం టెలీకాన్ఫరెన్స్ నిర్వహించారు. ప్రిజమ్-10 కార్యక్రమం లక్ష్యాలను వివరించారు. రక్తహీనతతో బాధపడుతున్న చిన్నారులు, గర్భిణులకు డ్రైరేషన్ అందివ్వాలని సూచించారు.